బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- 600 ఏళ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రం
- ఈ నెల 18 నుంచి 26 వరకు ఉత్సవాలు
- ముస్తాబైన దత్తాచల క్షేత్రం

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని మధుర గ్రామ శివారులోని గుట్టలో వెలిసిన దత్తాచల క్షేత్రం (దత్తయ్య గుట్ట)ఉత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 18న నుంచి 20వ తేదీ వరకు గణపతిపూజ, శాంతి మంత్రాలు, గోపూజ, పుణ్యాహవచనంతో పాటు పలు రకాల హోమాలు, యజ్ఞాలు, 21న మండప పూజ, చండీ పారాయణం, రుద్రహోమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 23న హారతి, మంత్రపుష్పం, సహస్రఘట జలాభిషేకం, 24న పూజలు, 25న చండీ పారాయణలో రుద్రజపం, దత్తజపం గురుచరిత్ర పారాయణం సకల దేవత హోమాలు, 26న దత్త జయంతి సందర్భంగా ఉదయం ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చండీహోమం, జాతర బండ్ల ఊరేగింపు, 27న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, పాచిబండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు అధికారులు సైతం హాజరుకానున్నట్లు ఆలయ నిర్వాహకులు సభాపతిశర్మ తెలిపారు.

ఆలయ చరిత్ర

మండల పరిధిలోని మధుర గ్రామ శివారులోని గుట్టలో వెలిసిన దత్తాచల క్షేత్రం(దత్తయ్య గుట్ట)కు 600 ఏళ్ల పైబడిన చరిత్ర ఉంది. మానవులను సన్మార్గంలో నడిపించి ధర్మాలను బోధించుటకు 12 శతాబ్దంలో శ్రీపాదవల్లభ వారుగా 15వ శతాబ్దంలో నృసింహ సరస్వతిస్వామివారిగా అవతరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అనేకమంది భక్తులకు ఆరాధ్యమైన నృసింహ సరస్వతిస్వామి వారు ఎన్నో పుణ్యక్షేత్రాల్లో తపం ఆచరించి దత్తాచల క్షేత్రంలోని గుహల్లో కొంతకాలం తపస్సు చేసి కర్ణాటక రాష్ట్రంలోని గాణుగాపురంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని కొంతకాలం భక్తుల కోరికలు తీరుస్తూ సమానత ధర్మాలను ఉపదేశించినట్లు పురాణాలు శాస్త్రాలు తెలుపుతున్నాయి.


ఆలయంలో కొలువుదీరిన దత్తాత్రేయస్వామి

రాతిబండపై పాదుకలు

దత్తాచల క్షేత్రంలోని గుట్టలోని పెద్ద రాతిబండపై దత్తాత్రేయ స్వామివారి పాదుకలు ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు, దత్త జయంతి, గురుపౌర్ణమి, వసంత పంచమి, ప్రతి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దత్తాచల క్షేత్రంలో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం

దత్తాచల క్షేత్రం గుహలో ఉన్న దత్తాత్రేయ స్వామి వారిని కొంతమంది దాతలు ముందుకు రావడంతో ఐదేళ్ల నుంచి ఆలయ నిర్మాణానికి స్వీకారం చుట్టినట్లు క్షేత్ర నిర్వాహకులు ,శ్రీచక్ర ఉపాసకులు, సభాపతిశర్మ తెలిపారు. నూతనంగా ఆలయాన్ని నిర్మించడానికి పూనుకొని ఇప్పటికీ 90శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మరికొంత మంది దాతలు ముందుకొస్తే పూర్తిస్థాయిలో దేవాలయ నిర్మాణం చేపడతామన్నారు.

ఎలా వెళ్లాలంటే..

హైదరాబాద్ పట్టణానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న హత్నూర మండలంలోని మధుర గ్రామ శివారులో దత్తాచల క్షేత్రం ఉంది. ఈ క్షేత్రానికి మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి దౌల్తాబాద్ మీదుగా క్షేత్రం వరకు రోడ్డు మార్గం ఉంది. పటాన్ చెరువు నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని దత్తాచల క్షేత్రం ఉంటుంది. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని దత్తాచల క్షేత్ర నిర్వాహకులు, దేవిఉపాసకులు సభాపతిశర్మ తెలిపారు.

నేటి నుంచి మల్లికార్జునస్వామి జాతర

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని మద్రి గ్రామంలో వెలిసిన భ్రమరాంభ మల్లికార్జునస్వామి సట్టి జాతర ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నారు. 17వ తేదీ ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలతో పూజలు ప్రారంభమౌతాయి. ఉదయం 9 గంటలకు జెండా ఊరేగింపు, ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు సట్టిబండ్ల ఊరేగింపును ప్రారంభిస్తారు. రాత్రి 10 గంటలకు మల్లికార్జునస్వామి భజన మండలి వారిచే భజన సంకీర్తన కార్యక్రమం అహోరాత్రులు నిర్వహిస్తారు. 18న సోమవారం తెల్లవారుజామున 4.30 గంలకు బోనాల కార్యక్రమం ఉంటుంది. ఉదయం 10.30 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఒగ్గుకథ కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు సట్టి బండ్ల ఆలయ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం స్వామివారి సర్వదర్శనం చేసుకొని మొక్కులు చెల్లిస్తారు. జాతర సందర్భంగా భక్తులకు నిత్యఅన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


ముస్తాబైన మల్లికార్జునస్వామి ఆలయం

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ


ముంగిలో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు


పూజలు నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని సట్టి హనుమాన్ దేవాలయంలో పరమేశ్వర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో నారికేళ 18వ పడిపూజను శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన అరుణ్ గురుస్వామి కనకమలచే శబరిమలైలో జరిగే విధంగా తంత్ర విధానంలో స్వామివారికి పూజలను జరిపించారు. జంగిరెడ్డి బృందం పాడిన పాటలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పరమేశ్వర్‌గౌడ్ గురుస్వామిని సంగారెడ్డి, సదాశివపేట, పటాన్‌చెరు గురుస్వాములు ఘనంగా సన్మానించారు.

ఘనంగా పడిపూజ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారితో పాటు నారాయణఖేడ్, రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వాములు హాజరయ్యారు. కార్యక్రమంలో గురుస్వాములు నర్సింహులు. మనీల్, రవి శ్రీనివాస్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


జగన్మోహన్


సింహాచలం

కంది(సంగారెడ్డి): యూటీఎఫ్ కంది మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జగన్‌మోహన్, సింహాచలం ఎన్నికయ్యారు. కందిలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం యూటీఎఫ్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా సంగయ్య, జ్యోత్స్నారెడ్డి, కోశాధికారి మేరీహెలెన్, కార్యదర్శులు గారాములు, సంజీవులు, సరళ, విఠల్, జేబున్నిసాలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీని ఆరు నెలల్లో అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చందర్ రాథోడ్, జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసుప్రభు మార్గంలో నడవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఏసు ప్రభు చూపిన మార్గంలో నడవాలని రెవ డాక్టర్ సంజయ్ పాల్ అన్నారు. మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని బేతస్త చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ సెలెబ్రేషన్ నిర్వహించారు. కార్యక్రమానికి సంజయ్‌పాల్‌తో పాటు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమానికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.

భారీ మెజార్టీతో సీఐటీయూ గెలుపు


విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న చుక్క రాములు, సీఐటీయూ నాయకులు


స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

జహీరాబాద్: పట్టణంలోని మహీంద్ర అండ్ మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ యూనిట్‌లో సీఐటీయూ అనుబంధ యూనియన్ విజయం సాధించింది. శనివారం నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో 76 ఓట్ల మెజార్టీతో సీఐటీయూ గెలిచింది. కర్మాగారంలో 410 ఓట్లు ఉండగా 403 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో ఇందులో సీఐటీయూ అనుబంధ యూనియన్ అయిన మహీంద్ర ట్రాక్టర్స్ ఎంప్లాయీస్ యూనియన్‌కు 227 ఓట్లు, బీఎంఎస్ అనుబంధ సంఘం అయిన మహీంద్ర లిమిటెడ్ మజ్దూర్ సంఘ్‌కు 25 ఓట్లు, బీఆర్‌టీయూ అనుబంధ యూనియన్ అయిన మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ ఆక్టీవ్ వర్కర్స్ యూనియన్‌కు 151 ఓట్లు పోలయ్యాయి.

విజయోత్సవ వేడుకలు

కర్మాగారంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ గెలుపొందడంతో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తమపై నమ్మకంతో గెలిపించినందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సదాశివపేట పట్టణంలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు నీలం మల్లేశం, శ్రీనివాస్, రమేష్‌గౌడ్, ఖయ్యూం, మహేందర్‌రెడ్డి, మోహన్‌చారి, అంజయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం


ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీడియో ప్రదర్శన ద్వారా తిలకిస్తున్న రైతులు

జహీరాబాద్: భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోది ప్రసంగాన్ని వీడియోద్వారా ప్రదర్శించి ప్రజలకు వినిపించారు. మండలంలోని దిడిగి గ్రామ శివారులోని డీడీఎస్–కేవీకేలో ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి పథకాలను పొందిన లబ్ధిదారుల అనుభవాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి అడిగి తెలుసుకున్నారు. సంబంధిత విషయాలను శాస్త్రవేత్త రమేష్ ప్రజలకు తెలుగులో అనువదించి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా ముద్ర యోజన, డ్రోన్ దిది యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛభారత్, జన్‌ధన్ యోజన అనే పథకాల గురించి తెలియజేశారు. ఈ పథకాలను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. అనంతరం కుటీర పరిశ్రమలు, మహిళలకు అందుబాటులో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్త్రీశక్తి, స్కీమ్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ ప్రైజెస్‌ల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు రమేష్, శైలజ, హేమలత, స్వామి, శ్రీధర్, జగన్, లక్ష్మణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని రాయిపల్లిలో ఎస్‌బీఐ, భవిష్య భారత్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువతకు ఉచిత ఆర్మీ శిక్షణలో శనివారం విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ బస్వరాజ్ మాట్లాడుతూ 1971లో భారత్ పాకిస్థాన్ యుద్ధం, సైనికులు చూపిన శౌర్యపరాక్రమాలను ఎల్‌ఈటీ స్క్రీన్ ద్వారా వీడియోలతో వివరించారు. అనంతరం శిక్షణలో ఉన్న యువకులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనర్ అసద్, ఫ్యాకల్టీ జహంగీర్‌పాషా, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్మీ శిక్షకులకు దుస్తులు అందజేస్తున్న ఎస్‌బీఐ, భవిష్య భారత్ సంస్థల నిర్వాహకులు

అభివృద్ధి పనులను ప్రారంభించండి


మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో వార్డు సిబ్బందితో కలిసి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఐజీ, ఎల్ఐజీ కాలనీలలో మంజూరైన రోడ్లను త్వరగా ప్రారంభించాలన్నారు. పలుచోట్ల నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలకు లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయాలని పారిశుధ్యం సిబ్బందికి సూచించారు. టిప్పర్, గ్రీన్ వెస్ట్ వాహనం కొరత గురించి జూనియర్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఆటోడ్రైవర్ల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంటగ్రామంలో ఆటోడ్రైవర్లు శనివారం నిరసన చేపట్టారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండటంతో తమకు గిరాకీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆటోడ్రైవర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకునే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి


పీఆర్ ఈఈ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

జహీరాబాద్ టౌన్: అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని రంజోల్ బాబానగర్ కాలనీవాసులు పీఆర్ ఈఈ జగదీశ్వర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. రంజోల్ నుంచి బాబానగర్ మీదుగా పిచరాగడి వరకు నాలుగేళ్ల క్రితం బీటీ రోడ్డు మంజూరైంది. రోడ్డు పనులు ప్రారంభమైన కొన్ని రోజుల తరువాత పనులు నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులతో పాటు బాబానగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కరణం రవికుమార్ శేఖర్, మల్లేశం, శ్రీనివాస్, కృష్ణ, మేరెళి తదితరులు శనివారం పీఆర్ ఈఈని కలిశారు. నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వాలీబాల్ పోటీలకు ఏర్పాట్లు

మునిపల్లి(అందోల్): ఈ నెల 21, 22వ తేదీన ఓపన్ టూ ఆల్ వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అంబేడ్కర్ సంఘం సభ్యులు రాములు, నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని తాటిపల్లి అంబేడ్కర్ కాలనీలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే టీం సభ్యులు రూ.600 చొప్పున చెల్లించి రశీదు తీసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 7780772250, 8309412500 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ ఉద్యోగుల సమ్మె విరమణ

నారాయణఖేడ్: వివిధ డిమాండ్ల పరిష్కారం కోసం నాలుగు రోజులపాటు నిరవధిక సమ్మె చేపట్టిన పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది శనివారం సమ్మె విరమించారు. పోస్టల్ ఉద్యోగుల సంఘం జాతీయ నాయకత్వం సూచన మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించి విధులకు హాజరైనట్లు పోస్టల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరోమణి, నాయకులు నర్సారెడ్డి, హన్మారెడ్డి, నాగయ్య తెలిపారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో 12 వార్డులోని పలు వీధుల్లో కాంట్రాక్టర్ అండర్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలేశాడు. నెలలు గడుస్తున్నా.. కాలనీ వాసులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కాగా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి, సీసీరోడ్లు వేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

టెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష లోయర్ అండ్ హైయర్ గ్రేడ్ ఇన్ డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ ఫిబ్రవరి 2024లో నిర్వహించుట గాను నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడో తరగతి ఉత్తీర్ణులైన వారు లోయర్ గ్రేడ్ పరీక్షకు అర్హులు లోయర్ గ్రేడ్ టెక్నికల్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు హైయ్యర్ గ్రేడ్‌లో సంబంధిత ట్రేడ్ పరీక్షకు అర్హులు తెలంగాణ స్టేట్ బోర్డు నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఉత్తీర్ణులైన వారు ముందుగానే డైరెక్టర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ తెలంగాణ నుంచి అనుమతి పొందాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.bre.teanfana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మంత్రిని కలిసిన నాయకులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాకేశ్‌షెట్కార్

నారాయణఖేడ్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హైదరాబాద్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్‌షెట్కార్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ గిరిజాషెట్కార్, శివరావు షెట్కార్‌లు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి తోడ్పాటును అందించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

వికలాంగులకు సైకిళ్లు పంపిణీ


ట్రై సైకిల్‌ను అందజేస్తున్న ఆర్డీఓ పాండు, ఎస్‌బీఐ సిబ్బంది

జోగిపేట(అందోల్): కార్పొరేట్ సొసైటీ రెస్పాన్సిబిలిటీ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్యాంక్‌లో వికలాంగులకు శనివారం ఉచితంగా ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అందోల్ జోగిపేట ఆర్డీఓ పాండు, బ్యాంక్ రీజినల్ మేనేజర్ నాగేశ్వరరావు, బ్యాంక్ మేనేజర్ శ్రావణి, సంగారెడ్డి జిల్లా వికలాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నే పోచయ్య, అందోల్ డివిజన్ అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి సంత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ కాలనీలో కొన్నేళ్లుగా మూసివేసిన శనివారం సంతను బెల్ యాజమాన్యం తిరిగి ప్రారంభించింది. దీంతో కూరగాయల వ్యాపారస్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బీహెచ్ఈఎల్ కాలనీలో స్థానికుల కోసం బీహెచ్ఈఎల్ యాజమాన్యం బుధవారం, శనివారం సంతలను ఏర్పాటు చేసింది. అందుకోసం రెండు ప్రాంతాల్లో కూరగాయల వ్యాపారస్తుల కోసం షెడ్లు తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేసింది. కాగా బుధవారం సందర్భంగా ఎప్పటిలాగానే కొనసాగుతుంది. దేవాలయాల సమీపంలోని శనివారం సంతను కొన్ని కారణాలవల్ల యాజమాన్యం మూసివేసింది. తిరిగి ప్రస్తుత బెల్ అధికార కార్మిక సంఘం, యాజమాన్యం కృషితో శనివారం నుంచి సంత ప్రారంభమైంది. ప్రతి శనివారం సంత కొనసాగనుంది.

ఎంపీ బీబీ పాటిల్ సోదరుడి మృతి


విఠల్‌రావు పాటిల్ (ఫైల్)

జహీరాబాద్: పార్లమెంట్ సభ్యుడు బీబీపాటిల్ సోదరుడు విఠల్‌రావు పాటిల్ శనివారం మరణించినట్లు బీఆర్ఎస్ నేతలు శనివారం తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలంలోని ఆయన స్వగ్రామం సిర్పూర్‌లో ఆదివారం ఉదయం విఠల్‌రావుపాటిల్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. విఠల్‌రావు మృతికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రగ్గులు పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణ పరిధిలోని మొగుడంపల్లి బీఆర్ఎస్ నాయకులు విజయమోహన్ రెడ్డి జన్మదినం పురష్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు మధుచౌహన్, మహేష్, గోవింద్ రాథోడ్, కిషన్‌చౌహన్, తుకారాం, మోహన్, నాగరాజ్ తదితరులు పట్టణంలో నివసిస్తున్న పేదలకు రగ్గులను పంపిణీ చేశారు.